


నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో ప్రకటనల కోసం సంప్రదించగలరు.

సెల్ : 94920 33365



WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి ఆదివారం 12-04-2026 సంపుటి: 01 సంచిక : 296 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Sunday 12-04-2026 Volume :01 Issue: 296 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది. తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

Contact Number
9059328777


# తేలిపోయిన సన్‌రైజర్స్ బౌలర్లు !

- ఐపీఎల్ 2026లో సన్ రైజర్స్‌కు మూడో ఓటమి
- పంజాబ్ కింగ్స్ చేతిలో 6 వికెట్ల తేడాతో పరాజయం
- అభిషేక్ శర్మ 28 బంతుల్లో 74 రన్స్
- శివంగ్ కుమార్ మినహా సన్ రైజర్స్ బౌలర్లంతా దారుణంగా విఫలం
- 219 రన్స్ కొట్టినా కాపాడలేకపోయిన బౌలర్లు

న్యూఢిల్లీ

ఐపీఎల్ 2026లో సన్ రైజర్స్ హైదరాబాద్ మూడో ఓటమిని చవిచూసింది. శనివారం పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచులో 6 వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. బ్యాటర్లు రాణించడంతో 219 రన్స్ చేసినా.. బౌలర్ల వైఫల్యంతో మరో ఓటమిని ఖాతాలో వేసుకుంది. ఈ టోర్నీలో మూడో విజయాన్ని ఖాతాలో వేసుకున్న పంజాబ్ కింగ్స్.. పాయింట్స్ టేబుల్‌లో 7 పాయింట్లతో రెండో -మిగతా 2 లో





## బెంగాల్‌లో తృణమూల్‌కు
# ఓటమి భయం

- అందుకు బిజెపిపై దాడులకు తెగిస్తున్నారు
- బీజేపీ అధికారంలోకి వస్తే మహిళలకు భద్రత కల్పిస్తాం
- పశ్చిమ బెంగాల్ నుంచి చొరబాటుదారులందరినీ తరిమేస్తాం.
- బెంగాల్ ప్రచార సభలో ప్రధాని మోడీ

కోల్‌కతా,

పశ్చిమ బెంగాల్‌లో భారతీయ జనతా పార్టీకి పెరుగుతున్న ప్రజా మద్దతును చూసి తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) భయాందోళనలో ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. శనివారం రాష్ట్రంలో జరిగిన ఒక బహిరంగ సభలో పాల్గొన్న మోదీ, ప్రస్తుత అధికార పార్టీ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో బీజేపీకి లభిస్తున్న ఆదరణను చూసి మమతా బెనర్జీ నేతృత్వంలోని ప్రభుత్వం భయాందోళనలకు గురవుతోందని ప్రధాని పేర్కొన్నారు. ఓటమి భయంతోనే టీఎంసీ నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే మహిళలకు భద్రత -మిగతా 2 లో

## దక్షిణాది రాష్ట్రాలను
# బలహీన పరచే కుట్ర

### 2011 జనాభా లెక్కల ఆధారంగా పునర్విభజన సరికాదు

- నియోజకవర్గాల పునర్విభజనలో అంతరం
- 42 శాతం రిజర్వేషన్ బిల్లు కేంద్రం వద్ద పెండింగ్
- బీసీ సబ్ ప్లాన్ అంశంపై ఆలోచన చేస్తాం
- రవీంద్రభారతిలో పూలే ద్విశతాబ్ది జయంతి వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్,

కుల గణన చేస్తామని ప్రకటించిన కేంద్రం ఆ లెక్కలు పరిగణలోకి తీసుకోకుండా 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాల ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం ఆయన రవీంద్ర భారతి తో ఏర్పాటు చేసిన మహాత్మా పూలే ద్విశతాబ్ది జయంతి వేడుకల సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ప్రకారం మాత్రమే పరిగణలో తీసుకొని నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది అవసరం లేకుండానే కేంద్రంలో ప్రభుత్వాలు -మిగతా 2 లో






## పూలే ఆశయాలకు
# కాంగ్రెస్ తూట్లు

- విద్యారంగం పూర్తిగా అస్తవ్యస్తం
- అక్షరాస్యతలో వెనకబడుతున్న తెలంగాణ
- కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రకటన

హైదరాబాద్,

ప్రముఖ సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘనంగా నివాళులర్పించారు. అణచివేతపై తిరుగుబాటుకు కేరాఫ్ అడ్రస్.. బడుగు, బలహీన వర్గాలకు కొండంత ధైర్యం... మహాత్మా జ్యోతి రావు పూలే అని వ్యాఖ్యానించారు. ఈ మేరకు బండి సంజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఏ సమాజమైతే చదువు పరంగా, ఆర్థికంగా ఎదుగుతుందో అప్పుడే ఆ సమాజం అభివృద్ధి చెందుతుందని ఆశించిడమే కాకుండా అందుకోసం చివరిదాకా కృషి చేసిన మహనీయుడు పూలే అని కొనియాడారు. ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను అభిమానించే -మిగతా 2 లో




## 200కు పైగా సీట్లలో
# గెలుస్తున్నాం

- ద్రవిడియన్ మోడల్ 2.0 ప్రభుత్వ ఏర్పాటు
- ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధీమా
- అన్నాడీఎంకే ఎలాంటి సిద్ధాంతాలు లేకుండా ఢిల్లీలోని బీజేపీకి మరబొమ్మలా మారింది

చెన్నై,

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే సారథ్యంలోని సెక్యులర్ ప్రోగ్రసివ్ అలయెన్స్ 200కు పైగా సీట్లు గెలుచుకుంటుందని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తెలిపారు. అన్నాడీఎంకే ఎలాంటి సిద్ధాంతాలు లేకుండా ఢిల్లీలోని బీజేపీకి మరబొమ్మలా మారిందని అన్నారు. తమ ఐదేళ్ల ద్రవిడియన్ తరహా పాలనలో లెక్కలేనన్ని సంక్షేమ పథకాలు అమలు చేశామని, కలైంజ్ఞర్ మహిళా సాధికారతా పథకం కింద నెలకు రూ.1000 ఆర్థిక సాయం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, పాఠశాల పిల్లలకు బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్, రెండు లక్షల -మిగతా 2 లో

# యూపీఐ పేమెంట్స్‌కు పదేళ్లు పూర్తి..





- 49 శాతం వాటాతో భారత్‌దే అగ్రస్థానం..!

న్యూఢిల్లీ

భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ పదేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం కీలక వివరాలను వెల్లడించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న రియల్-టైమ్ చెల్లింపుల లావాదేవీల్లో ఏకంగా 49 శాతం వాటాతో భారత్ అగ్రస్థానంలో నిలిచిందని తెలిపింది. గణాంకాల ప్రకారం.. కేవలం 2026 జనవరి నెలలోనే యూపీఐ ద్వారా -మిగతా 2 లో

# నేడు ఇంటర్ ఫలితాలు విడుదల

- ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ ఫలితాలు విడుదల కానున్నాయి.
- రాష్ట్రవ్యాప్తంగా దాదాపు తొమ్మిదిన్నర లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు.
- అధికారికంగా ప్రకటించిన బోర్డు




హైదరాబాద్

తెలంగాణ ఇంటర్ పరీక్ష ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాలను ఆదివారం విడుదల చేయనున్నట్లు ఇంటర్ బోర్డు అధికారికంగా ప్రకటించింది. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ ఫలితాలు విడుదల కానున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు -మిగతా 2 లో



## ఎన్నికల కమిషన్‌తో
# బీజేపీ కుమ్మక్కు

- స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సమయంలో 90 లక్షల మంది పేర్లను బీజేపీ బలవంతంగా తొలగించింది
- ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు గెలవలేక తప్పుడు మార్గాల ద్వారా ఓట్లను రాబట్టుకునేందుకు బీజేపీ కుట్రలు
- తన అభ్యర్థిత్వాన్ని చెల్లకుండా చేసే యత్నం
- ఎన్నికల ప్రచారసభలో మమతా బెనర్జీ విమర్శలు

కోల్‌కతా,

ఎన్నికల కమిషన్‌తో బీజేపీ కుమ్మక్కై భవనాపూర్ నుంచి తన అభ్యర్థిత్వాన్ని చెల్లకుండా చేసేందుకు ప్రయత్నించినట్టు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చెప్పారు. పశ్చిమ మేదినిపూర్ జిల్లాలోని కేషియారిలో శనివారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆమె మాట్లాడుతూ, తనపై తప్పుడు కేసులు బనాయించడం ద్వారా భవనాపూర్ నుంచి తన అభ్యర్థిత్వాన్ని చెల్లకుండా చేసేందుకు బీజేపీ ప్రయత్నించిందని అన్నారు. అయితే ఆ పార్టీ గేమ్ ప్లాన్‌ను టీఎంసీ కార్యకర్తలు, ప్రజలు భగ్నం చేశారని తెలిపారు. భవనాపూర్‌లో మమతా బెనర్జీపై బీజేపీ అభ్యర్థిగా సువేందు అధికారి పోటీలో ఉన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సమయంలో 90 లక్షల మంది పేర్లను బీజేపీ బలవంతంగా తొలగించిందని మమతా బెనర్జీ ఈ సందర్భంగా ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు గెలవలేక తప్పుడు మార్గాల ద్వారా ఓట్లను రాబట్టుకునేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఆ కారణంగానే లక్షలాది ఓటర్లను వాళ్లు తొలగించారని, -మిగతా 2 లో

## ఎప్పుడు ఎన్నికలొచ్చినా అవి
# కేసీఆర్ ఎన్నికలే




### కేసీఆర్ అధికారంలోకి వచ్చేలా ఫలితాలు

- అనేక హామీలతో డబ్బా కొట్టుకున్న రేవంత్
- నిరుద్యోగులను మోసం చేసిన ప్రభుత్వం
- రెండున్నర సంవత్సరాల్లో 11 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు
- మహిళలకు స్కూటీలు, తులం బంగారం అన్నాడు.. నెలకు రూ.2500 ఇస్తా అన్నాడు..
- ఇబ్రహింపట్నం కార్యకర్తల భేటీలో కేటీఆర్

హైదరాబాద్,

ఈ అరాచక పాలనను అంతమొందించాలంటే కొత్తతరం నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని,. రాబోయే రోజుల్లో ఎన్నికలు ఎప్పుడొచ్చినా అవి కేసీఆర్ ఎన్నికలుగానే ఉంటాయి.. అసెంబ్లీ ఎన్నికలు కాదు. కేసీఆర్ ఎన్నికలే ఈ రాష్ట్రంలో జరుగుతాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ తిరిగి అధికారంలోకి వచ్చే ఎన్నికలే జరుగుతయని నాకు విశ్వాసం ఉందన్నారు. ఇది నా ఆలోచన కాదు.. రాష్ట్రంలో ఎవరినైనా అన్నా ఎట్లున్నది పరిస్థితి -మిగతా 2 లో




## బీఆర్ఎస్‌లోకి వెళ్లి జీవన్
# రెడ్డి తప్పు చేశారు

- ఇన్నాళ్లూ తమకంటే ఎక్కువగా బీఆర్ఎస్ అవినీతిపై మాట్లాడిన ఆయన ఆ పార్టీతో చేతులు కలపడం బాధాకరం
- బీఆర్ఎస్ ముక్కలైందని.. ఆస్తుల కోసం కొట్టుకుంటున్నారని విమర్శించారు
- బీజేపీకి తెలంగాణలో ఆదరణ లేదని అన్నారు.
- కాంగ్రెస్ పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

ములుగు,

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరి మాజీ మంత్రి జీవన్ రెడ్డి తప్పుచేశారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఇన్నాళ్లూ తమకంటే ఎక్కువగా బీఆర్ఎస్ అవినీతిపై మాట్లాడిన ఆయన ఆ పార్టీతో చేతులు కలపడం బాధాకరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ముక్కలైందని.. ఆస్తుల కోసం కొట్టుకుంటున్నారని విమర్శించారు. బీజేపీకి తెలంగాణలో ఆదరణ లేదని అన్నారు. శనివారం ములుగు జిల్లాలో మహేశ్ కుమార్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. -మిగతా 2 లో

# తేలిపోయిన సన్‌రైజర్స్ బౌలర్లు !

మొదటి తరువాయి



స్థానంలో నిలిచింది. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్ హైదరాబాద్ 6 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ 28 బంతుల్లో 74 రన్స్ చేశాడు. సన్ రైజర్స్ భారీ స్కోరు చేయడంతో విజయంపై ధీమాగా ఉంది. కానీ సన్ రైజర్స్ బౌలర్లు మాత్రం పంజాబ్ కింగ్స్ బ్యాటర్ల ముందు తేలిపోయారు. పవర్ ప్లేలోనే మ్యాచ్‌ను పంజాబ్ వైపు తిప్పేశారు ఆ జట్టు బ్యాటర్లు. సన్ రైజర్స్ హైదరాబాద్ పవర్ ప్లేలో 105/1 చేయగా.. పంజాబ్ కింగ్స్ కూడా ధాటిగా బదులిచ్చింది. పవర్ ప్లే ముగిసే సరికి 93/0తో నిలిచింది. ప్రియాన్ష్ ఆర్యా 16 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేశాడు. ప్రభ్ సిమ్రాన్ సింగ్ (25 బంతుల్లో 51 రన్స్) కూడా సత్తాచాటడంతో పంజాబ్ ఆధిపత్యం చలాయించింది. ప్రియాన్ష్ (20 బంతుల్లో 57 పరుగులు) ఔట్ అయిన తర్వాత శ్రేయస్ అయ్యర్ బాధ్యత తీసుకున్నాడు. 33 బంతుల్లో 69 పరుగులు చేసి అజేయంగా నిలిచి జట్టుకు విజయాన్ని అందించాడు. పంజాబ్ కింగ్స్ 18.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ టోర్నీలో మూడో విజయాన్ని సాధించింది. శివంగ్ కుమార్ మినహా సన్ రైజర్స్ బౌలర్లంతా దారుణంగా విఫలమయ్యారు. శివంగ్ 4 ఓవర్లలో 33 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీశాడు. జయదేవ్ ఉనద్కత్ 3 ఓవర్లు వేసి 40 పరుగులు, ఎషాన్ మలింగ 3 ఓవర్లలో 46 పరుగులు, హర్షల్ పటేల్ 2 ఓవర్లలో 39 పరుగులు సమర్పించుకున్నారు. దీంతో సన్ రైజర్స్ హైదరాబాద్ ఐపీఎల్ 2026లో మూడో ఓటమిని చవిచూసింది.

## బెంగాల్‌లో తృణమూల్‌కు ఓటమి భయం

మొదటి తరువాయి

కల్పిస్తామని, రాజకీయ హింసలో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పూర్బ బర్ధమాన్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ.. 'పశ్చిమ బెంగాల్ నుంచి చొరబాటుదారులందరినీ తరిమేస్తాం. అలాంటి వారికి మద్దతునిచ్చి, వారు ఇక్కడ స్థిరపడటానికి సహాయపడిన వారిపై కూడా చర్యలు తీసుకుంటాం. అమాయక ప్రజలపై, రాజకీయ ప్రత్యర్థులపై దాడులకు పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెడతాం. అవినీతి, శాంతిభద్రతలపై శ్వేతపత్రాన్ని విడుదల చేస్తాం. ప్రతి టీఎంసీ గూండా, సిండికేట్, అవినీతిపరుడైన ఎమ్మెల్యే లేదా మంత్రిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. రాజకీయ హింసపై విచారణ జరిపేందుకు, విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ఒక విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేస్తాం. ఇప్పుడు అమలు అవుతున్న పథకాలను బీజేపీ అడ్డుకోదు. మేం అధికారంలోకి వస్తే తొలి కేబినెట్ సమావేశంలోనే పశ్చిమ బెంగాల్‌లో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకాన్ని అమలు చేస్తాం' అని అన్నారు. కాగా, పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీలలో రెండు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

## 200కు పైగా సీట్లలో గెలుస్తున్నాం

మొదటి తరువాయి

మంది రైతులకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని చెప్పారు. 'ప్రజలకు మా పార్టీ పట్ల అపారమైన ప్రేమ, నమ్మకం ఉన్నాయి. సెక్యులర్ ప్రోగ్రసివ్ అలయెన్స్ 200కు పైగా సీట్లలో గెలిచి ద్రవిడియన్ మోడల్ 2.0 ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది' అని స్టాలిన్ తెలిపారు. కాంగ్రెస్‌తో సీట్ల పంపకాల వ్యవహారంలో ఈసారి సంక్లిష్టంగా మారడంపై అడిగినప్పుడు, సీట్ల కేటాయింపు విషయంలో అలాంటివి మామూలేనని, అయితే చర్చలు సుహృద్భావ వాతావరణంలో ముగిసాయని చెప్పారు. కూటమిలోని నేతలు, కార్యకర్తలు సమష్టిగా అభ్యర్థుల విజయానికి కృషి చేస్తున్నారని చెప్పారు. 2019 నుంచి తమ కూటమి మరింత బలపడిందని, మరిన్ని పార్టీలు వచ్చి చేరాయని చెప్పారు. తమిళనాడులోనే కాకుండా పుదుచ్చేరిలోనూ తమ కూటమి గెలుపు సాధిస్తుందని చెప్పారు. ఏప్రిల్ 9న పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ముఖ్యమంత్రి కుటుంబం పవర్ సెంటర్‌లా వ్యవహరిస్తోందంటూ అన్నాడీఎంకే చీఫ్ ఎడప్పాడి పళనిస్వామి ఆరోపణలను స్టాలిన్ కొట్టివేశారు. పళనిస్వామి కట్టుకథలపై తాను స్పందించాల్సిన పనిలేదని అన్నారు. రాష్ట్రంలో మహిళలపై నేరాలపై పళనిస్వామి చేస్తున్న ఆరోపణలను ప్రస్తావిస్తూ, పొల్లాచ్చి లైంగిక దాడుల ఘటన పళనిస్వామి సారథ్యంలోని అన్నాడీఎంకే అవకతవకల పాలనకు ఒక నిదర్శనమని, అప్పటి మహిళా ఐపీఎస్‌పై కూడా లైంగిక వేధింపులు జరిగాయని చెప్పారు. మహిళల భద్రతపై కానీ, శాంతిభద్రతలపై కానీ పళనిస్వామికి మాట్లాడే అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. తమిళనాడును గుట్కా గిడ్డంగిగా ఆయన మార్చారని, తాము అధికారంలోకి వచ్చాక కఠిన చర్యలు తీసుకుని గుట్కా సహా మాదకద్రవ్యాలను తుడిచిపెట్టామని, కఠిన చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఉద్యోగాలు చేసే మహిళల భద్రతకు హాస్టళ్లు ఏర్పాటు చేశామని, మహిళలపై నేరాలకు కఠిన చర్యలు అమలయ్యేలా సంబంధిత చట్టాలలో మార్పులు చేశామని స్టాలిన్ చెప్పారు. తమిళనాడులో వర్కింగ్ ఉమెన్స్ ఎక్కువనీ, వారి భద్రతకు తాము భరోసాగా ఉన్నామని తెలిపారు. మహిళల భద్రత విషయంలో దేశంలోనే తమిళనాడు నెంబర్ వన్ స్థానంలో ఉందని చెప్పారు.

## ఎన్నికల కమిషన్‌తో బిజెపి కుమ్మక్కు

మొదటి తరువాయి

ఫలితాలు తమకు అనుకూలంగా ఉండేలా ఈవీఎంల ట్యాంపరింగ్ చేసే ఆలోచనలో కూడా ఉన్నారని అన్నారు. ఎస్ఐఆర్ పక్రియ కారణంగా 250 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. తొలగించిన 90 లక్షల మంది ఓటర్లలో 60 లక్షల మంది హిందువులు, 30 లక్షల మంది ముస్లింలు ఉన్నారు. బెంగాలీ మాట్లాడినంత మాత్రమే మనం భారతీయులం కాదా? నిరంతరం పౌరసత్వం నిరూపించుకోవాలా?' అని మమతా బెనర్జీ ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని అమలు చేస్తామంటూ బీజేపీ ఎన్నికల హామీపై మాట్లాడుతూ, ఈ చర్యను వెనుకబడిన వర్గాలపై నేరుగా దాడి చేసేందుకు, ప్రజల ప్రజాస్వామ్య హక్కులను కొల్లగొట్టేందుకు జరుపుతున్న దాడిగా ఆమె పేర్కొన్నారు. పశ్చిమబెంగాల్‌లో యూసీసీని అమలు చేసేది లేదన్నారు. రాష్ట్రంలో వరుసగా నాలుగోసారి అధికారంలోకి వచ్చి.. ఢిల్లీలో బీజేపీకి ఉద్వాసన పలుకుతామని, ఆ వెంటనే యూసీసీని రద్దు చేస్తామని మమత స్పష్టం చేశారు.

# పూలే ఆశయాలకు కాంగ్రెస్ తూట్లు

మొదటి తరువాయి

జ్యోతిరావు పూలే కుల వివక్షపై అలుపెరగని పోరాటం చేశారని కీర్తించారు. ఆ రోజుల్లోనే వితంతు పునర్వివాహాలు జరపడంతోపాటు బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని ప్రశంసించారు. మహిళల చదువు కోసం నిరంతరం పాటుపడ్డారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం జ్యోతిరావు పూలే ఆశయాలకు, స్ఫూర్తికి భిన్నంగా పాలన కొనసాగిస్తోందని బండి సంజయ్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యాశాఖ పనితీరు దారుణంగా ఉందని తెలిపారు. అక్షరాస్యతలో జాతీయ సగటు కంటే తెలంగాణ పూర్తిగా వెనుకబడి ఉండటం ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. ఏళ్ల తరబడి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో లక్షలాది మంది పేద, మధ్యతరగతి ప్రజలు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని చెప్పుకొచ్చారు. ఆరోగ్య శ్రీ బకాయిలు ఏళ్ల తరబడి



చెల్లించకపోవడంతో కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్య శ్రీ కార్డుపై చికిత్స చేయించుకోలేని దుస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వ భూములను ఎడాపెడా అమ్ముతూ భవిష్యత్తు తరాలకు గజం జాగా కూడా లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందన్నారు. ఇకనైనా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూలే ఆశయాలను మాటల్లో కాకుండా చేతల్లో చూపాలని బండి సంజయ్ కోరారు. పూలే దీనబంధు అనే పత్రికను స్థాపించి బీదల, కార్మికుల సమస్యలను సమాజానికి తెలిసేలా చేశారని బండి సంజయ్ కుమార్ ప్రస్తావించారు. అట్టడుగు వర్గాల్లో విజ్ఞానాన్ని నింపడానికి, పేదలను ఆదుకోవడానికి సర్వస్వం త్యాగం చేసిన మహోన్నతుడు పూలే అని చెప్పారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పూలేను గురువుగా ప్రకటించుకున్నారంటే ఆయన గొప్పదనం ఏంటో అర్థమవుతుందని అన్నారు. సతీమణి సావిత్రీబాయి పూలేతో కలిసి విద్యా ఉద్యమాన్ని ప్రారంభించి ఏకంగా 52 పాఠశాలలను ప్రారంభించి వేలాది మంది పేదలకు అక్షర జా&ఝనాన్ని అందించిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. స్వాతంత్యం÷-ర రాని రోజుల్లోనే నిర్బంధాలను, అణిచివేతలను తట్టుకుంటూ అణగారిన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు తెచ్చేందుకు జ్యోతిరావు పూలే చేసిన కృషి చిరస్మరణీయమని కీర్తించారు.

# దక్షిణాది రాష్ట్రాలను బలహీన పరచే కుట్ర

మొదటి తరువాయి

ఏర్పడతాయని తెలిపారు. కుల గణన చేయకుండా నియోజకవర్గాల విభజన చేపడితే ఫలితం మరోరకంగా ఉంటుందని డిప్యూటీ సీఎం అన్నారు. దక్షిణాది రాష్ట్రాలు పెద్ద ఎత్తున సామాజిక మార్పునకు నాంది పలుకుతున్నాయని, కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నాయని ద్రవిడ రాష్ట్రాలను బలహీన పరిచేందుకు కేంద్రం నుంచి వచ్చే పన్నుల వాటాలో భారీగా తగ్గింపులు చేశారని డిప్యూటీ సీఎం వివరించారు. తెలంగాణ నుంచి పన్నుల రూపేనా ఒక రూపాయి కేంద్రానికి వెళితే తిరిగి రాష్ట్రానికి 37 పైసలు మాత్రమే వస్తుందని, తమిళనాడు నుంచి రూపాయి వెళితే తిరిగి ఆ రాష్ట్రానికి 29 పైసలు, కేరళ నుంచి రూపాయి వెళితే తిరిగి ఆ రాష్ట్రానికి 61 పైసలు మాత్రమే వస్తున్నాయని తెలిపారు. అదే ఉత్తరాది బీహార్ నుంచి కేంద్రానికి రూపాయి వెళితే తిరిగి కేంద్రం నుంచి ఆ రాష్ట్రానికి 6.53 రూపాయలు వెళుతున్నాయని, ఉత్తరప్రదేశ్ నుంచి కేంద్ర ప్రభుత్వానికి రూపాయి వెళితే తిరిగి ఆ రాష్ట్రానికి పన్నుల వాటాల రూపంలో 2.17 రూపాయలు వెళుతున్నాయని డిప్యూటీ సీఎం వివరించారు. దక్షిణాది రాష్ట్రాల పట్ల జరుగుతున్న వివక్ష, కేంద్రం ఉద్యమాలను కట్టడి చేస్తున్న తీరు, నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఇటీవల పెద్ద ఎత్తున చర్చ జరిగిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ,ియోజకవర్గాల పునర్విభజనలో కుల గణన ను పరిగణలోకి తీసుకోకపోతే యావత్ భారత దేశంలోని బలహీన వర్గాలకు నష్టం జరుగుతుందని, మనకోసం మనం పోరాడాల్సిన అవసరం ఏర్పడిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రజా ప్రభుత్వం బడ్జెట్లో పెద్ద ఎత్తున ప్రజలే కేంద్రంగా నిధులు కేటాయించింది ఇదే జరిగితే తమకు పెద్ద ఎత్తున నష్టం జరుగుతుందని భావించి రాష్ట్రంలో ఫ్యూడల్ శక్తుల పునరేకికరణ ప్రయత్నం జరుగుతుందని డిప్యూటీ సీఎం హెచ్చరించారు. బహుజనులు ఏకం కావాలి ప్రజా ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని కాంగ్రెస్ అమల్లోకి తీసుకువచ్చింది బీసీ సబ్ ప్లాన్ డిమాండ్ తాజాగా తెరపైకి వచ్చింది ఈ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆలోచన చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. అంతరాలు లేని సమాజం కోసం జనాభా ఆధారంగా నిధులు కేటాయించాలి, జనాభా దామాషా ప్రకారం నిధులు ఖర్చు చేసినప్పుడే సకల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. సామాజిక న్యాయం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉంది ఎన్ని అవాంతరాలు వచ్చినా నిటారుగా నిలబడుతుందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. భారతదేశంలో కులం అనేది వాస్తవం అధికారంలోకి రాగానే కుల సర్వే చేపడతామని మా నాయకుడు రాహుల్ గాంధీ ఎన్నికల ముందు ప్రకటించారు ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే కుల సర్వే చేసి రాష్ట్రంలో 56 మంది బీసీలు ఉన్నారని తమ ప్రభుత్వం లెక్క కట్టి చెప్పిందని తెలిపారు. వంద సంవత్సరాల క్రితం బ్రిటిష్ వారు కుల సర్వే చేశారు ఆ తర్వాత దేశంలో కుల సర్వే చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. కుల సర్వే ఆధారంగా స్థానిక సంస్థల్లో, విద్యా ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి బిల్లును గవర్నర్ కు పంపాం, ఆయన కేంద్ర ప్రభుత్వానికి పంపగా అక్కడ బిల్లు పెండింగ్ లో ఉందని తెలిపారు. మహాత్మ పూలే ఆలోచనలను ఏ చిన్న అవకాశం దక్కిన, ప్రతి సందర్భంలో పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. కుల వివక్ష, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా కుంగిపోకుండా తట్టుకొని నిలబడాలి అని ఆచరించి భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలబడ్డారు అందుకే మహాత్మా పూలే మహానుభావుడు అయ్యారు అని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఓసి అన్ని వర్గాల పిల్లలు 12వ తరగతి వరకు ఒకే చోట చదువుకునేలా అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. అధికారంలోకి రాగానే 40 శాతం డైట్ 200శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచామని, మన బిడ్డలు ఎవరు అర్ధాకలితో ఉండకూడదనే మంచి ఉద్దేశంతో ప్రతిరోజు నాణ్యమైన డైట్ ను అందించడమే కాదు వాటిని పర్యవేక్షించేందుకు చీఫ్ సెక్రటరీ నుంచి మండల స్థాయి అధికారి వరకు సీఎం నుంచి సర్పంచి వరకు గురుకులాలు సంక్షేమ వసతి గృహాలు సందర్శించాలి అవసరమైతే అక్కడే నిద్రించాలని నిబంధన పెట్టి ఎప్పటికప్పుడు నివేదికలు తీసుకుంటున్నట్టు డిప్యూటీ సీఎం వివరించారు. జూన్ 2 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనే 20 లక్షల మంది విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం పథకం ప్రారంభిస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో 15 కోట్లతో సకల సౌకర్యాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రారంభిస్తున్నామని డిప్యూటీ సీఎం ప్రకటించారు. కుల వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి ఉచితంగా విద్యుత్తు అందిస్తున్నామని తెలిపారు.

# ఎప్పుడు ఎన్నికలొచ్చినా అవి కేసీఆర్ ఎన్నికలే

మొదటి తరువాయి

అని అడగండి. రైతన్నల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. నేను జగిత్యాలకు పోతే అక్కడ ఓ రైతు సోదరుడు కలిసిండు. అన్న ఎట్లున్నది పరిస్థితి అని అడిగిన. ఆ ఏముంది సార్ మూడు సార్లు రైతు బంధు ఎగ్గొట్టిండు. రూ.27 వేల కోట్లు మిగిలినయి. అందులో నుంచి 20 వేల కోట్లు ఇచ్చి రుణమాఫీ చేసినా అని డబ్బా కొట్టుకుంటున్నడు. మా పైసలు మాకే ఇచ్చి మిాదికెల్లి బాకీ ఉన్నడు.. కానీ బయటకు మాత్రం రైతు బంధు ఎగ్గొట్టిన అని చెప్పడు. రుణమాఫీ చేసినా అని చెప్పి.. అది కూడా ఊరిలో చారానా మందికి చేసిండు. బారానా మందికి కాలేదు. అగో గట్లుంది పాలనా అని ఒకే ఒక్కమాటలో రైతన్న చెబుతున్నడని అంటూ ఎద్దేవా చేశారు. ఏ యువకుడినైనా అడగండి రెండు లక్షల ఉద్యోగాలని ఊరించి పెద్ద పెద్ద మాటలు చెప్పి చివరకు మోసం చేసి గద్దెనెక్కి.. ఇంతవరకు రెండున్నర సంవత్సరాల్లో 11 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. మహిళలకు స్కూటీలు, తులం బంగారం అన్నడు.. నెలకు రూ.2500 ఇస్తా అన్నడు.. అత్తకు రూ.4 వేలు, కోడలుకు రెండున్నర వేలు నోటికి ఎంతొస్తే అంత మాటలిచ్చి మహిళలను మోసం చేసిండు. కేసీఆర్ రాకముందు 200 పెన్షన్ వచ్చేది. కేసీఆర్ దాన్ని రూ.2 వేలు చేసిండు. నవంబర్‌లో అయితే రూ.2వేలు, డిసెంబర్‌లో అయితే 4 వేలు అని చెప్పిండు. ముసలోళ్లను కూడా మోసం చేసిండు. రెండు నెలలు ఇప్పటికీ పెన్షన్ ఎగ్గొట్టిండు. 28 నెలల్లో సాధించింది ఏమైనా ఉందంటే ఒకే ఒక్కటి ఢిల్లీకి పోవుడు. వచ్చుడు.. ఎక్కే విమానం.. పోయే విమానం తప్ప ఈ రాష్ట్రంలో చేసింది మాత్రం ఏమీ లేదన్నాడు. మీ ఎమ్మెల్యే గురించైతే నేను చెప్పే అవసరమే లేదు. ఆయన ఎట్లాంటోడో ఏమేం వసూళ్లు చేస్తడో నాకంటే బాగా మీకే తెలుసు. ఆఖరికి అరటి పండ్ల బండ్లను కూడా విడిచిపెట్టడట అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. గట్లాంటోడి గురించి నేను మాట్లాడ కని.. ఒకటి మాత్రం పక్కా. మంచి రెడ్డి లాంటి మంచి నాయకుడిని కోల్పోవడం వల్ల ఆయనకేం నష్టం కాలేదు. ఆయన బాగానే ఉన్నడు.. కానీ నష్టపోయింది ఇబ్రహీం పట్నం ప్రజలు అని గుర్తు చేస్తున్నా. మంచి నాయకుడు కేసీఆర్‌ను కోల్పోయినం. ఇబ్రహీంపట్నంలో మంచి రెడ్డి కిషన్ రెడ్డి లాంటి మంచి నాయకుడిని పోగోట్టుకున్నం. అందుకే ఈ ప్రభుత్వం చేస్తున్న అరాచకలు నా కంటే బాగా మీకే తెలుసనన్నారు కేటీఆర్. కేసీఆర్ నాయకత్వంలో 14 వేల ఎకరాలు సేకరించి గ్రీన్ ఫార్మా సిటీ పెట్టాలని పట్టుబట్టామని అన్నారు. స్టేట్ ఆఫ్ ది ఆర్ట్.. అంటే ప్రపంచంలోనే అత్యున్నతమైన ప్రమాణాలతో స్థానికంగా కాలుష్యమనేది లేకుండా అక్కడే బాగా చేయాలనే ఉద్దేశంతో దాదాపు 7 సంవత్సరాలు కిషన్ రెడ్డి, సబితక్క, నేను కష్టపడి చాలా మందిని ఒప్పించి మెప్పించి కొంత ఇబ్బంది పెట్టి కూడా రైతులకు మొక్కాలే.. తద్లాండి 14 వేల ఎకరాలు సేకరించినమని చెప్పుకొచ్చారు. అయితే ఇప్పుడేం జరుగుతున్నదో చూస్తున్నామని అన్నారు.

## నేడు ఇంటర్ ఫలితాలు విడుదల

మొదటి తరువాయి

జరగ్గా.. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు తొమ్మిదిన్నర లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. వెబ్‌సైట్‌లలో విద్యార్థులు తమ రోల్ నంబర్ ఎంటర్ చేయడం ద్వారా ఒక్క క్లిక్‌తోనే రిజల్ట్‌ని పొందొచ్చు. మరోవైపు, ఇంటర్ విద్యార్థులు తమ రిజల్ట్‌ని నేరుగా తమ వాట్సప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొనే సదుపాయాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. ఈ ఫలితాల కోసం మీ సేవా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా.. వాట్సప్‌లోనే పొందేలా ఏర్పాటు చేసింది. స్మార్ట్ ఫోన్‌లలో 80969 58096 నంబర్‌ను సేవ్ చేసుకొని 'హాయ్ అని టైప్ చేయడం ద్వారా ఫలితాలు చెక్ చేసుకోవచ్చు.

## బిఆర్ఎస్‌లోకి వెళ్లి జీవన్ రెడ్డి తప్పు చేశారు

మొదటి తరువాయి

ఇప్పటికే బిఆర్ఎస్‌లోకి వెళ్లిన వారి గతి ఏమయ్యిందో చూశామని అన్నారు. బిఆర్ఎస్‌లో కుటుంబానికే ప్రాధాన్యమని అన్నారు. కాంగ్రెస్ పట్ల ప్రజల్లో రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందన్నారు. ఉన్నఫలంగా ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ 100స్థానాల్లో గెలుస్తుందని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. దశా, దిశా లేకుండా పదేళ్లు కేసీఆర్ పరిపాలన చేశారని, రూ.8 లక్షల కోట్లు అప్పు చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తమ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని తెలిపారు. కాంట్రాక్టర్లు ఇచ్చే డబ్బులతో జేబులు నింపుకోవడంతోనే కాళేశ్వరం కూలిపోయిందని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు చేశారు.

## యూపీఐ పేమెంట్స్‌కు పదేళ్లు పూర్తి..

మొదటి తరువాయి




21.70 బిలియన్ల లావాదేవీలు జరిగాయి. వీటి విలువ రూ.28.33 లక్షల కోట్లు.దేశంలోని మొత్తం రిటైల్ డిజిటల్ లావాదేవీల్లో 81 శాతం యూపీఐ ద్వారానే జరుగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొన్నది. ప్రారంభమైన నాటి నుంచి లావాదేవీల పరిమాణంలో 12,000 రెట్లు, విలువలో 4,000 రెట్లకు పైగా వృద్ధిని యూపీఐ నమోదు చేసింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ సైతం యూపీఐని ప్రపంచంలోనే అతిపెద్ద రియల్-టైమ్ చెల్లింపుల వ్యవస్థగా అభివర్ణించింది. కేవలం లావాదేవీల సంఖ్యకే పరిమితం కాకుండా యూపీఐ సామాన్యుడి జీవితంలో కూడా భాగమైంది. ఆటోరిక్షా డ్రైవర్ల నుంచి వీధి వ్యాపారులు, గ్రామీణ మార్కెట్ల వరకు యూపీఐ సేవలు విస్తరించాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య, అధికారిక, అనధికారిక ఆర్థిక వ్యవస్థల మధ్య అంతరాన్ని తగ్గించి, ఆర్థిక సమ్మిళితత్వానికి మార్గం వేసిందని ప్రభుత్వం తన ప్రకటనలో పేర్కొన్నది. భారత యూపీఐ వ్యవస్థ పనితీరు, భద్రత, వేగాన్ని ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ లాంటి అంతర్జాతీయ సంస్థలు ప్రశంసించాయి. ప్రస్తుతం యూఏఈ, సింగపూర్, ఫ్రాన్స్, శ్రీలంక, మారిషస్ సహా 8 దేశాల్లో యూపీఐ సేవలు అందుబాటులోకి వచ్చాయి. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా యూపీఐ లైట్, యూపీఐ ఆటోపే, క్రెడిట్ ఆన్ యూపీఐ వంటి కొత్త సేవలను కూడా అందుబాటులోకి తెచ్చారు. దశాబ్ద కాలంలోనే దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ వ్యవస్థ, నేడు ప్రపంచానికే ఆదర్శంగా నిలవడం గమనార్హం.

# విద్యార్థి దశ నుంచి క్రీడలను ప్రోత్సహించాలి: ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

- వరంగల్‌లో డబ్ల్యూ టి డి ఏ--2026 ఇంటర్ డిస్ట్రిక్ట్ టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే




**ఉమ్మడి వరంగల్ ఏప్రిల్ 11 (నేటి దర్శిని బ్యూరో):** ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు క్రీడలను తప్పనిసరి చేయవలసిన అవసరం ఉందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.వరంగల్ డిస్ట్రిక్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆఫీసర్స్ క్లబ్లో ప్రతిష్టాత్మకంగా డబ్ల్యూ డబ్ల్యూ టి డి ఎ--2026 ఇంటర్ డిస్ట్రిక్ట్ టెన్నిస్ టోర్నమెంట్ ను వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత జీవనశైలిలో శారీరక వ్యాయామం ఎంతో అవసరమని, క్రీడలు యువతను సరైన దిశలో నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి క్రీడా కార్యక్రమాలకు ప్రభుత్వ తరఫున పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ టోర్నమెంట్‌లో మొత్తం 90 జట్లు పాల్గొనడం టెన్నిస్ క్రీడపై పెరుగుతున్న ఆసక్తికి నిదర్శనమని తెలిపారు.ఈ టోర్నమెంట్ ప్రాంతీయ క్రీడాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించడానికి మంచి వేదికగా నిలుస్తుందని, మన ప్రాంతంలో క్రీడా సంస్కృతిని మరింతగా పెంపొందించడంలో దోహదపడుతుందని అన్నారు.

వరంగల్ ఆఫీసర్ క్లబ్ తరపున టోర్నమెంట్ విచ్చేసిన టెన్నిస్ టీములకు ఎలాంటి రుసుము లేకుండా ఉచిత భోజనము ఉచిత వసతి కల్పించారు.ఈ కార్యక్రమంలో డబ్ల్యూ టి డి ఎ అధ్యక్షులు గంద్ర సత్యనారాయణ రెడ్డి, రవీందర్ రెడ్డి,మురుగన్, కన్నా రెడ్డి, టీ. బాబు రెడ్డి, కమల్, డా. జయసింహ రెడ్డి, రవీంద్రనాథ్, ప్రభాకర్ రావు, వి.ఎస్. రెడ్డి, జి. రవీందర్, దుర్గా ప్రసాద్, శరత్, డా. ప్రవీణ్, తెలుగు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మూడోరోజు ప్రధాన మంత్రి సంసద్ ఖేల్ కార్యక్రమం



షాద్ నగర్ నియోజకవర్గంలో

- పాల్గొన్న పార్లమెంట్ ఇంచార్జ్ ముచ్చర్ల జనార్దన్ రెడ్డి



**మిడ్జిల్, ఏప్రిల్11 (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** మహబూబ్ నగర్ జిల్లా పార్లమెంట్ పరిధిలో సంసద్ ఖేల్ మహోత్సవ్ కార్యక్రమం మూడవరోజు ఈ కార్యక్రమం పాలమూరు పార్లమెంట్ పరిధిలో, మన ఎంపీ డీకే అరుణ ఆధ్వర్యంలో పార్లమెంట్ పరిధిలో. ఇది క్రీడా ప్రోత్సాహానికి పెద్ద ఉదాహరణ అని పార్లమెంట్ ఇంచార్జ్ ముచ్చర్ల జనార్దన్ రెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా, ముచ్చర్ల జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ, “క్రీడా స్ఫూర్తిని యువతలో పెంచాలని సదుద్దేశంతో అరుణ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. యువత చాలా మంది ఈ మధ్యకాలంలో క్రీడలకు దూరంగా ఉన్న సందర్భంలో, ఈ ఆన్‌లైన్ గేమ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్స్కి దూరంగా ఉండి, అదే విధంగా సోషల్ మీడియాలో చెడుకి దూరంగా ఉండి, మంచిని పెంపొందే విధంగా ఉండాలి. అదే విధంగా, గెలుపోటములో సమానంగా కృషి చేసే శక్తి కేవలం క్రీడాకారులకే ఉంటుంది, కాబట్టి రెగ్యులర్‌గా క్రీడలు ఆడడం వల్ల మానసికంగా, శారీరకంగా, అన్నివిధాలుగా క్రీడలు మనిషి యొక్క నిత్యజీవితంలో ఎంత దోహదపడతాయో అన్నారు. యువత మత్తు, మద్యం,గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని చెప్పారు. క్రమేపీ గ్రామాల్లో కూడా గంజాయి వాడకం యువతలో పెరిగిందని ఈ సందర్భంలో వారు గుర్తుచేశారు. మానసిక ఉల్లాసానికి, అదే విధంగా స్నేహభావాన్ని పెంపొందించడానికి క్రీడలు ఎంతగానో ధోహదపడుతాయని, ఎంపీ డీకే అరుణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ గొప్ప క్రీడా పోటీలను విజయం సాధించాలని, గెలుపొందినవారికి గవర్నర్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం కార్యక్రమం ఉంటుందని అందరూ క్రీడా స్ఫూర్తితో ఈ కార్యక్రమంలో విజయవంతంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు, క్రీడా అభిమానులు తదితరులు పాల్గొన్నారు..



జడ్చర్ల నియోజకవర్గంలో బాలానగర్ మండల కేంద్రంలో






# అభివృద్ధి అంటే అనిరుద్ రెడ్డి... అనిరుద్ రెడ్డి అంటే అభివృద్ధి

- అభివృద్ధికి కేరాఫ్ గా మారిన అనిరుద్ రెడ్డి
- గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఒక్క రేషన్ కార్డు ఇచ్చిన పాపాన పోలేదు
- సమస్య ఉందని చెప్తే వెంటనే పరిష్కారం
- మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మేడిపల్లి నరేందర్ రెడ్డి



కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిపల్లి నరేందర్ రెడ్డి

**మిడ్జిల్ ఏప్రిల్ 11, (నేటి దర్శిని ప్రతినిధి):** అభివృద్ధి అంటే అనిరుద్ రెడ్డి .. అనిరుద్ రెడ్డి అంటే అభివృద్ధి అని జడ్చర్ల నియోజకవర్గ ప్రజలు అంటున్నారని జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిపల్లి నరేందర్ రెడ్డి అన్నారు. జడ్చర్ల నియోజకవర్గంలో సమస్య ఉందని తెలిస్తే వెంటనే స్పందించి పరిష్కారమయ్యే వరకు వదిలిపెట్టని వ్యక్తి మన అందరికీ ప్రియతమ నాయకుడు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి అని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. రేషన్ కార్డ్స్, ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత బస్సు, గృహజ్యోతి, గ్యాస్, సిసి రోడ్లు, పేదలకు సన్నాబియ్యం, రైతులకు రుణమాఫీ, అండర్ డ్రైనేజ్ పనులతో దూసుకుపోతున్నారని ఆయన అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇచ్చిన పాపాన పోలేదని విమర్శించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు రోడ్లు రోడ్లు మంజూరు చేశారని చెప్పారు.డబల్ రోడ్ల పనులు చురుగ్గా సాగుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతుందని చెప్పారు.

# సన్ షైన్ పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహణ




**చండూరు, ఏప్రిల్ 11 (నేటి దర్శిని):** చండూరు మున్సిపాలిటీ పరిధిలోని సన్ షైన్ పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యను పూర్తిచేసిన చిన్నారుల కోసం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం ఉత్సాహభరిత వాతావరణంలో కళకళలాడింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల కరస్పాండెంట్ కోడి వెంకన్న మాట్లాడుతూ, ప్రీ ప్రైమరీ విద్య పూర్తి చేసిన విద్యార్థులు ఇకపై ప్రైమరీ స్థాయిలో అడుగుపెట్టబోతున్నారని, ఈ దశలోనే క్రమశిక్షణ, మంచి ఆలోచన విధానం, నడవడిక వంటి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. చదువులోనూ ప్రతిభ కనబరుస్తూ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. గ్రాడ్యుయేషన్ డే వంటి కార్యక్రమాలు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా, భవిష్యత్ లక్ష్యాలపై స్పష్టతను కలిగిస్తాయని పేర్కొన్నారు. భావి భారత పౌరులుగా ఎదగాలంటే చిన్నప్పటి నుంచే పట్టుదలతో కృషి చేయాలని, లక్ష్య సాధన కోసం నిరంతరం ప్రయత్నించాలన్నారు.ఈ సందర్భంగా ప్రీ ప్రైమరీ విద్యార్థులు మాట్లాడుతూ, మొదట్లో పాఠశాలలో చేరినప్పుడు ఉన్న భయాన్ని అధిగమించి, ఇప్పుడు ధైర్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. తమ భవిష్యత్ నిర్మాణానికి ఉపాధ్యాయులు అందించిన మార్గదర్శకానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కోడి సుష్మ వెంకన్న, ప్రిన్సిపాల్ రవికాంత్, కార్యక్రమ నిర్వాహకులు రమేష్ సార్, లతీఫ్ పాషా, ఉపాధ్యాయినీలు తదితరులు పాల్గొన్నారు.

# సంపూర్ణ ఆరోగ్యవంతులను చేసేందుకు అమ్మ మాట- అంగన్వాడి బాట: మంత్రి సీతక్క




**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 11 (నేటి దర్శిని బ్యూరో):** రాష్ట్రవ్యాప్తంగా చాలామంది చిన్నారులు పోషకార లోపంతో బాధపడుతున్నారని, వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులను చేసేందుకు అమ్మ మాట- అంగన్వాడి బాట కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని మాతా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శనివారం పోషణ్ పక్వాడ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. చిన్నారులను బుజ్జగించేందుకు తల్లిదండ్రులు పెడుతున్న జంక్ ఫుడ్ పారి పాలిట విషం గా మారుతోందని పేర్కొన్నారు . స్మార్ట్ ఫోన్ బాలల కంటి చూపులు దెబ్బతీస్తుందని తెలిపారు. అంగన్వాడి సెంటర్లో గర్భిణీ స్త్రీలకు చిన్న పిల్లలకు పౌష్టికాహారము అందిస్తున్నామని తెలిపారు. చిన్నపిల్లలకు అంగన్వాడి సెంటర్ల ద్వారా వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు .ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు.

# వరంగల్ నగరంలోని ఎంజీఎం లో డి- అడిక్షన్ సెంటర్ ను పరిశీలించిన కలెక్టర్లు, సిపి




**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 11 (నేటి దర్శిని బ్యూరో):** వరంగల్ నగరంలోని ఎంజీఎం హాస్పిటల్ లో డి- అడిక్షన్ సెంటర్ సేవలను మరింత మెరుగుపరచాలని, బాధితులకు సమగ్ర సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద అన్నారు. శనివారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సెంటర్ ను పరిశీలించారు. ఈ కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలు ,పునరావస కార్యక్రమాలు ,రోగులకు అందిస్తున్న సౌకర్యాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

# జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పించిన సీఎం




**ఆమనగల్లు, ఏప్రిల్ 11(నేటి దర్శిని ప్రతినిధి):** మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని ఢిల్లీలోని తన నివాసంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆ మహనీయుడి చిత్రపటానికి శనివారం పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

# నిరుపేదల ఇంటి నిర్మాణం కోసం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సాయం అందజేత



**ఆమనగల్లు,ఏప్రిల్ 11(నేటి దర్శిని ప్రతినిధి);** ఆమనగల్ పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డ్ కు చెందిన నసీం బేగం భర్త జాంగిర్ అనే నిరుపేదలకు నూతనంగా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణం కొరకు ఉప్పల ట్రస్ట్ చైర్మన్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తన ట్రస్టు ద్వారా ఇంటి స్లాబ్ కొరకు సరిపడేంత ఐరన్, సిమెంట్ ను ఇప్పించడం జరిగింది. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదవారికి ఇంటి నిర్మాణం కొరకు గాని, విద్యార్థుల చదువు కొరకు గానీ, సేవా కార్యక్రమాల్లో ముందుంటామని నాగిళ్ల జగన్ అన్నారు.ఈ కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ నాగిళ్ల జగన్,కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యా విస్తరణకు మార్గదర్శకుడు జ్యోతిరావు పూలే: వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

- పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- పూలే జయంతి సందర్భంగా ఘన నివాళులు
- మహిళల అభివృద్ధికి పూలే సేవలు చిరస్మరణీయం
- తెలంగాణ కులగణన దేశానికి ఆదర్శం
- దేశవ్యాప్తంగా కులగణన కేంద్ర ప్రభుత్వం చేపట్టాలి



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 11 (నేటి దర్శిని బ్యూరో):** మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పిలుపునిచ్చారు. పూలే 200వ జయంతి సందర్భంగా ములుగు క్రాస్ రోడ్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి ఎంపీ డాక్టర్ కడియం కావ్య పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూజ్యోతిరావు పూలే మహిళల అభివృద్ధి కోసం విశేష కృషి చేశారని గుర్తు చేశారు. విద్యకు ప్రాధాన్యతనిస్తూ సమాజంలో కొత్త మార్గాలను చూపించిన మహనీయుడిగా ఆయనను కొనియాడారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక కులగణనను విజయవంతంగా నిర్వహించిందని ఎంపీ తెలిపారు. సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ అంశాలను సమగ్రంగా పరిగణలోకి తీసుకుంటూ సర్వే చేపట్టినట్లు చెప్పారు. సేకరించిన డేటాను అసెంబ్లీలో ప్రవేశపెట్టడం ద్వారా "తెలంగాణ మోడల్" దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. తెలంగాణలో అమలు చేసిన విధానాన్ని దేశవ్యాప్తంగా కూడా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య, వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, చాహాత్ బాజ్ పాయ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్ పాల్గొని మహాత్మా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# సామాజిక సమానత్వం కోసం జీవితాంతం పోరాడిన జ్యోతిరావు పూలే : ఎమ్మెల్యే నాగరాజు



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 11 (నేటి దర్శిని బ్యూరో):** విద్య సమాజ మార్పుకు ప్రధాన ఆయుధమని నమ్మి ప్రజల్లో చైతన్యం కలిగించిన మహానుభావుడు పూలే అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ కొనియాడారు. మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణ కేంద్రం నందు ఆయన చిత్రపటానికి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ సామాజిక సమానత్వం, విద్యా విస్తరణ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం పోరాడిన మహానేత జ్యోతిరావు పూలే అని ఎమ్మెల్యే కొనియాడారు. సమాజంలో ఉన్న జాతి వివక్ష, అన్యాయం అసమానతలను తొలగించేందుకు మహాత్మ జ్యోతిరావు పూలే చేసిన పోరాటం భారతదేశ సామాజిక చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని తెలిపారు. మహిళల విద్యకు ప్రాధాన్యం ఇచ్చి బాలికల కోసం మొదటి పాఠశాలను ప్రారంభించడం ద్వారా మహిళల సాధికారతకు పూలే బాటలు వేసారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆ కాలంలో సమాజంలో నెలకొన్న మూఢనమ్మకాలు, వివక్షతలపై ధైర్యంగా పోరాడి సమానత్వ సమాజ నిర్మాణానికి పునాది వేసిన గొప్ప సామాజిక సంస్కర్తగా ఆయన నిలిచారని అన్నారు. అణగారిన వర్గాలు, పేద ప్రజలు, రైతులు, శ్రమజీవుల హక్కుల కోసం మహాత్మ జ్యోతిరావు పూలే చేసిన కృషి తరతరాలకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే చెప్పారు. నేటి సమాజంలో కూడా పూలే ఆలోచనలు ఎంతో ప్రయోజన కారిగా ఉన్నాయని, సమానత్వం, సామాజిక న్యాయం, విద్యా విస్తరణ ఆయన చూపిన మార్గంలోనే సాధ్యమవుతాయని ఎమ్మెల్యే అన్నారు. ప్రజల సంక్షేమం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించే దిశగా అందరూ కలిసి పనిచేయాలని ఎమ్మెల్యే నాగరాజు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు అండగా యలమందల జగదీష్

- 20 కుటుంబాలకు నిత్యావసరాలు, 25 కేజీల బియ్యం పంపిణీ
- జన్మదినాన్ని సేవా దినంగా మార్చిన యలమందల జగదీష్



**ఖమ్మం, ఏప్రిల్ 11 (నేటి దర్శిని):** ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు వెన్నుదన్నుగా నిలుస్తూ యలమందల జగదీష్ తన జన్మదినాన్ని సేవా దినంగా మార్చుకున్నారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ కైకొండాయిగూడెం గ్రామానికి చెందిన 20 నిరుపేద కుటుంబాలకు నెలరోజులకు సరిపడే నిత్యావసర సరుకులు మరియు 25 కేజీల బియ్యాన్ని పంపిణీ చేసి ఆదర్శంగా నిలిచారు. ఎలక్ట్రానిక్ మీడియా ఖమ్మం నగర అధ్యక్షులు, నాయి బ్రాహ్మణ సేవా సంఘం నగర ప్రెసిడెంట్‌గా ఉన్న జగదీష్, సమాజ సేవ పట్ల తన నిబద్ధతను మరోసారి చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే నిజమైన మానవత్వమని, "మానవ సేవే మాధవ సేవ" అనే సిద్ధాంతంతో ముందుకు సాగుతున్నానని తెలిపారు. లబ్ధిదారులు జగదీష్ సేవలను కొనియాడుతూ, వేసవి కాలంలో ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బంది పడుతున్న తమలాంటి కుటుంబాలకు అవసరమైన సరుకులు అందించడం ఎంతో ఉపశమనాన్ని కలిగించిందన్నారు. తమ కుటుంబాలకు పెద్దన్నగా నిలిచిన జగదీష్ చేసిన సహాయాన్ని ఎప్పటికీ మరచిపోమని తెలిపారు.



జగదీష్ జన్మదినాన్ని పురస్కరించుకొని కైకొండాయిగూడెంలో భారీ కేక్ కట్ చేసి, పాల్గొన్న వారికి స్వీట్లు పంచిపెట్టారు. గ్రామ ప్రజలు, జగదీష్ అన్న యువసేన (వైజెఎస్), స్నేహితులు బొకేలు, శాలువలతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఖమ్మం ప్రెస్ క్లబ్, నాయి బ్రాహ్మణ సేవా సంఘం కార్యాలయం, దొడ్డి కొమరయ్య సినిమా కార్యాలయం, ఎల్.హెచ్.పి.ఎస్ ఆధ్వర్యంలో, విద్యానగర్ కాలనీలో కూడా జగదీష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

# మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఘన నివాళులు


- సమానత్వ సమాజ నిర్మాణమే నిజమైన శ్రద్ధాంజలి: కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్‌నగర్, ఏప్రిల్ 11 (నేటి దర్శిని):** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ప్రముఖ సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా హయత్‌నగర్‌లో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హయత్‌నగర్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని కొనియాడారు. మహిళల విద్య, సామాజిక సమానత్వం, దళితుల హక్కుల పరిరక్షణలో పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టి సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహాత్మ పూలే చూపిన మార్గం నేటి తరానికి దిక్సూచి వంటిదని, ఆయన కలలు కన్న సమాజాన్ని నిర్మించడమే ఆయనకు నిజమైన నివాళి అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, నాయకులు పిట్టల జంగం, శక్తి సింగ్, లక్ష్మణ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల అభ్యున్నతి, మహిళల సాధికారతే పూలేకు ఘన నివాళి

- విగ్రహాలకు కాదు, ఆశయాలకు నివాళి అర్పించాలి: రఘు గౌడ్





**ఎల్బీనగర్, ఏప్రిల్ 11 (నేటి దర్శిని):** మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జాతీయ సంగం అధ్యక్షులు బొంగు రఘు గౌడ్ ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూలే కేవలం ఒక వ్యక్తి కాకుండా సమాజంలో ఉన్న అసమానతలపై ప్రశ్నించిన గొప్ప చైతన్యమని పేర్కొన్నారు. విగ్రహాలకు పూలమాలలు వేయడం, ఫోటోలకు నివాళులు అర్పించడం సులభమని, కానీ వారి ఆశయాలను ఆచరణలో పెట్టడం అసలు సవాలని అన్నారు. విద్య, వైద్యం, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో పేద ప్రజలకు నిజమైన ఫలాలు అందినప్పుడే పూలే ఆశయాలు నెరవేరుతాయని తెలిపారు. ప్రస్తుతం వ్యవస్థలో పెట్టుబడిదారులు, కార్పొరేట్ ప్రభావం పెరిగిందని, ఈ నేపథ్యంలో ప్రజల హక్కులు, పేదల అభ్యున్నతి మరింత బలపడాల్సిన అవసరం ఉందన్నారు. పాలన నిజంగా ప్రజల చేతుల్లోకి వచ్చినప్పుడే పూలే కల సాకారం అవుతుందని స్పష్టం చేశారు. మహిళల సాధికారత విషయానికొస్తే స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్లు ఉన్నప్పటికీ, భవిష్యత్తులో 50 శాతం వరకు అవకాశాలు రానున్నాయని తెలిపారు. అయితే, మహిళల పేరుతో పదవులు ఉన్నా నిర్ణయాధికారం వేరే చేతుల్లోనే కొనసాగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఆడపిల్ల చదువుకోవాలి, ప్రతి మహిళ స్వతంత్రంగా నిలబడాలన్నదే పూలే సంకల్పమని గుర్తుచేశారు. పూలే ఆశయాలను కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా, మహిళలకు నిజమైన స్వేచ్ఛ, అధికారాన్ని కల్పించి, పేద ప్రజలకు విద్య, వైద్యం, జీవనోపాధి అవకాశాలు అందించడం ద్వారా నిజమైన నివాళి అర్పించాల్సిన అవసరం ఉందని బొంగు రఘు గౌడ్ పేర్కొన్నారు.

# ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



**యాచారం , ఏప్రిల్ 11 (నేటి దర్శిని):** మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు యాచారం మండలం నక్కర్త - మేడిపల్లి గ్రామంలో సిపిఎం పార్టీ ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే సమాజ సంస్కరణల పట్ల చేసిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ యాచారం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహా, మండల కమిటీ సభ్యులు ఆలంపల్లి. జంగయ్య, ముచ్చర్ల లాజర్, గ్రామ శాఖ కార్యదర్శులు గడ్డం కుమార్, వడ్డేమోని భూషణ్, ఆలంపల్లి యాదయ్య శ్రీష్ట వార్డ్ సభ్యులు ఆలంపల్లి మహేష్ మరియు పార్టీసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే...



**మిడ్జిల్ , ఏప్రిల్ 11(నేటి దర్శిని ప్రతినిధి);**
మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని మిడ్జిల్ మండలంలోని చిల్వేర్ గ్రామపంచాయతీ ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి ఆ మహనీయుడి చిత్రపటానికి శనివారం పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోల్గం నాగరాజ్ గౌడ్, పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. జిల్లా నాయకులు,మండల నాయకులు, మార్కెట్ డైరెక్టర్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు

# మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం ఆదర్శనీయం

- బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 11 (నేటి దర్శిని బ్యూరో):**
సామాజిక ఉత్సవ కెరటంగా ఎదిగిన పూలే జీవితం అందరికీ ఆదర్శనీయమని బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ పేర్కొన్నారు.మహాత్మా జ్యోతిరావు పూలే119వ, జయంతి సందర్భంగా వరంగల్ నగరంలోని దేశాయిపేట లోని జ్యోతిరావు పూలే విగ్రహానికి బిజెపి జిల్లా అధ్యక్షులు గంటా రవికుమార్ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే త్యాగాలను, సమాజానికి చేసిన సేవలను గుర్తు చేశారు. సామాజిక కార్యకర్తగా, వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన సంఘ సంస్కర్త పూలే భావి తరాలకు సైతం మార్గదర్శకుడని గుర్తు చేస్తూ, సమాజంలో వివక్షకు తావు లేదని, సమానత్వం ఉండాలని జీవితాంతం పోరాడిన మహనీయుడు పూలే అన్నారు.వెనుకబడిన వర్గాలు, దళిత జనోద్ధరణకు ఆయన ఎంచుకున్న బాట, అనుసరించిన మార్గం సమాజ శ్రేయస్సును కాంక్షించే వారందరికీ స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు కొండేటి శ్రీధర్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, తాబేటి వెంకట్ గౌడ్, జిల్లా నాయకులు కూచన క్రాంతి కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, ఓబిసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బైరి మురళీకృష్ణ, గోగికర్ అనిల్, జిల్లా నాయకులు గోకే వెంకటేష్, అంకాల జనార్ధన్, బైరి శ్యాం సుందర్, ముంద్రాతి వెంకటేశ్వర్లు, అల్లి అజయ్, మాదాసు రాజు, కోమాకుల నాగరాజు, మండల అధ్యక్షులు విప్ప సుధాకర్, మహమ్మద్ రఫీ, బోరిగం నాగరాజు మండల నాయకులు జన్ను పాటు సుబ్రహ్మణ్యం, తోట సురేష్, కొంతం సంగీత్, మల్లికార్జున్, ప్రభాకర్ గుప్త, హనుమంతు, శ్రీధర్, జన్ను నాగరాజు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తిరుమలగిరి సాగర్‌లో ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు

- పూలే ఆశయాలు స్ఫూర్తిగా ముందుకు సాగాలి: పిడిగం నాగయ్య ముదిరాజ్



**తిరుమలగిరి సాగర్, ఏప్రిల్ 11 (నేటి దర్శిని):**
మండల కేంద్రంలోని తిరుమలగిరి సాగర్‌లో మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి ఉత్సవాలు అఖిలపక్షం మరియు బహుజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిడిగం నాగయ్య ముదిరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే భారతదేశంలో గొప్ప సామాజిక సంస్కర్తగా, విద్యావేత్తగా, కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడిగా నిలిచారని పేర్కొన్నారు. స్త్రీ విద్యకు పునాది వేసి, దళిత మరియు అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేసిన పూలే సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సమానత్వం, విద్య, సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన మార్గాన్ని అందరూ అనుసరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇరిగి గంగయ్య (మాజీ సర్పంచ్), నాదెండ్ల వెంకటరెడ్డి (మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు), అనుముల అంజి (మాజీ సర్పంచ్), ఉపసర్పంచ్ తిరుపతమ్మ, శ్రీను (మాజీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు), ఇరిగి రామయ్య, చవ్వ నాసర్ రెడ్డి, కటికర్ల మల్లయ్య, ప్రేమిలా, కొచ్చెరల్ల కోటేష్, జూపల్లి గోపి, వల్లపు ఎల్లయ్య (వార్డ్ మెంబర్), సత్రసాల వెంకటయ్య, మధు, పెదమాము సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

# మిడ్జిల్ కేంద్రంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో అవినీతి బయటపెడతాం: ఎమ్మెల్యే

- కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ
- జూన్ 23న సీఎం రేవంత్ రెడ్డి మిడ్జిల్ పర్యటన





ఎమ్మెల్యే మాట్లాడుతూ..



మండల తహసిల్దార్ ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతూ..

**మిడ్జిల్, ఏప్రిల్11 (నేటి దర్శిని ప్రతినిధి):**
మిడ్జిల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 65 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి పంపిణీ చేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ, జడ్చర్ల నియోజకవర్గంలో దాదాపు ప్రతి గ్రామానికి, తండాలకు బీటి రోడ్లను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, త్రిబుల్ ఐటీ కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను మంజూరు చేయడం ద్వారా పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 23న మిడ్జిల్ మండల కేంద్రానికి రానున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఆ రోజు మిడ్జిల్ మండలం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందుతుందని అన్నారు. ఉమ్మడి మిడ్జిల్, ఉర్కొండ మండలాల అభివృద్ధికి భారీ ఎత్తున నిధులను సీఎం మంజూరు చేస్తారని స్పష్టం చేశారు. అలాగే, మిడ్జిల్ మండల కేంద్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణంలో సుమారు 42 లక్షల రూపాయల అవినీతి జరిగిందని, ఉర్కొండలో కూడా ఇదే పరిస్థితి నెలకొన్నదని ఆరోపించారు. ఈ అంశంపై త్వరలోనే పూర్తి ఆధారాలతో ప్రజల ముందుకు తీసుకువస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి మార్కెట్ చైర్ పర్సన్ తంగేళ్ల జ్యోతి, ఎమ్మార్వో , మండల గ్రామ సర్పంచులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# జ్యోతిరావు పూలే స్ఫూర్తితో సామాజిక పోరాటాలు నిర్వహిద్దాం.



మిడ్జిల్ మండల కేంద్రంలో అంబేద్కర్ భవన్ ఆవరణలో



వాడియాల గ్రామపంచాయతీ కార్యాలయంలో

- రాజకీయ అఖిలపక్షం నాయకులు

**మిడ్జిల్,ఏప్రిల్ 11. (నేటి దర్శిని ప్రతినిధి):**
సంఘసంస్కర్త సామాజిక ఉద్యమకారుడు మహాత్మ జ్యోతిరావు పూలే స్ఫూర్తితో భారతదేశంలో సామాజిక న్యాయ సాధన కోసం మిడ్జిల్ అంబేద్కర్ సంఘంకృషి చేస్తుందని ఆ సంఘం నాయకులు అన్నారు. శనివారం మిడ్జిల్ మండల కేంద్రంలోఅంబేద్కర్ భవనం ఆవరణలో మహాత్మ జ్యోతిరావు పూలే 200వ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా రాజకీయ అఖిలపక్షం నాయకులు మాట్లాడుతూ "చదువు లేకపోతే జ్ఞానం ఉండదు. జ్ఞానం లేకపోతే నైతిక విలువలుండవు. నీతి లేకపోతే అభివృద్ధి ఉండదు. ప్రగతి లేకపోతే సంపద ఉండదు. సామాజిక విప్లవ జ్యోతి జ్యోతిరావ్ పూలే 1827, ఏప్రిల్ 11న మహారాష్ట్రలోని సతారా జిల్లాలో గోపండ. రావ్ పుర, చిమ్నాబాయి. దంపతుల ఇంట జన్మించారు నాటి కట్టుబాట్లకు తగినట్టుగా పద మూడేళ్లకే ఆయనకు తొమ్మి దేళ్ల సావిత్రీబాయితో వివాహం అయింది.నాడు కులం పేరుతో జరిగిన అవమానం జ్యోతిరావ్ జీవితాన్ని మలుపు తిప్పింది. సంఘసం స్కర్తను, రచయితను చేసింది. కులవివక్షకు వ్యతిరేకంగా... దళితుల హక్కుల కోసం, స్త్రీ విద్యను ప్రోత్సహిస్తూ పోరాడారు అణగారిన వర్గాల అభ్యున్నతికి 'సత్యశోధక్ సమాజ్న నెలకొల్పారు. ఇది కులవివక్షకు ప్రశ్నిస్తూ ఆర్థిక సామాజిక సమానత్వాన్ని ప్రోత్సహించింది. సావిత్రి బాయి కూడా భర్త సహకారంతో సంఘ సంస్కరణ ఉద్యమాలలో దురుగ్గా పాల్గొనేవారు. ఆనాటి సామాజిక అడ్డంకులను అధిగమిస్తూ ఈ జంట దేశంలోనే మొదటిసారి పుణెలో 1818లో బాలికల కోసం పాఠశాలను స్థాపించారు. అక్కడ భోధించడానికి టీచర లేకపోవడంతో సావిత్రికి చదువు నేర్చి ఉపాధ్యాయు రాలిని చేశారు అంతే కాకుండా రైతులు, మహిళలు, కార్మికుల కోసం రాత్రి పాఠశాలలు ప్రారంభించారు.తరతరాల సంప్రదాయాలను సవాలుచేస్తూ పూలే దంపతులు ఉద్యమాలు చేపట్టడం ఆధిపత్య వర్గాలకు కంట గింపయ్యింది. వారి బెడిగింపులకు ఏ మాత్రం భయపడ లేదు.వెనకడుగు వేయలేదు. వితంతు పునర్వివాహాలను సమర్థించడంతో పాటు, అనాథల కోసం ఆశ్రమాలను స్థాపిం వారు 'గులాంగిరి', 'తృతీయ రత్న' వంటి పులె రచనలు బహుశ ప్రాచుర్యం పొందాయి పక్షవాతం వచ్చి శరీరం ఒక పక్క పని చేయకపోయినా, ఎడమ చేత్తో తన చివరి పుస్తకు 'సార్వజనిక సత్య ధర్మను పట్టుదలతో పూర్తిచేసి 63 ఏళ్లకే తుదిశ్వాస విడిచారు. వారి స్ఫూర్తితో నేడు దేశంలో సామాజిక వివక్ష గురవుతున్న పేదల జీవితాలలో వెలుగు నింపడానిక కృషి చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల రాజకీయ నాయకులు, అంబేద్కర్ సంఘం నాయకులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




ఉర్కొండ మండల కేంద్రంలో

# సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీలో సీసీ రోడ్ల శంకుస్థాపన

- పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**బి.ఎన్.రెడ్డి నగర్, ఏప్రిల్ 11 (నేటి దర్శిని):**
బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీలో నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్‌బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరై పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు సీసీ రోడ్ల నిర్మాణం కీలకమని పేర్కొన్నారు. స్థానిక ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఎల్లప్పుడూ ముందుంటామని హామీ ఇచ్చారు..ఈ కార్యక్రమంలో బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, నాయకులు అనిల్ చౌదరి, పార్టీ సీనియర్ నాయకులు, ఉద్యమకారులు, కార్యకర్తలు, మహిళలు, అలాగే సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా డ్రగ్స్ వ్యతిరేక అవగాహన ర్యాలీ







● పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ..


**మిడ్జిల్, ఏప్రిల్ 11, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా, మహబూబ్‌నగర్ టౌన్‌లోని క్లాక్ టవర్ కూడలి నుండి తెలంగాణ చౌరస్తా వరకు ఈగల్ ఫోర్స్ మరియు మహబూబ్‌నగర్ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన ర్యాలీ నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ డి.జానకి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువత భవిష్యత్తును కాపాడుకోవాలంటే మాదక ద్రవ్యాల నుండి దూరంగా ఉండాలని, సమాజం మొత్తం కలిసి డ్రగ్స్ నిర్మూలనలో భాగస్వాములు కావాలని సూచించారు. మెడికల్ షాప్ నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ ఔషధాల విక్రయం జరపాలని హెచ్చరించారు.
జిల్లా ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వల్ల వ్యక్తిగత ఆరోగ్యం మాత్రమే కాకుండా కుటుంబం మరియు సమాజంపై తీవ్రమైన ప్రభావం ఉంటుందని తెలిపారు. డ్రగ్స్ పై సమాచారం ఉన్న వారు పోలీసులకు తెలియజేయాలని, డ్రగ్స్ నియంత్రణలో పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ వ్యతిరేక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ ర్యాలీలో సుమారు 600 మంది విద్యార్థులు పాల్గొనగా, మెడికల్ షాప్ నిర్వాహకులు, సిబ్బంది మరియు ఫార్మా కాలేజ్ విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు మరియు పాల్గొన్న అందరితో కలిసి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.

**"డ్రగ్స్‌కు నో చెప్పండి -- ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దాం"**

ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి వెంకటేశ్వర్లు, ఈగల్ ఫోర్స్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి డిఎస్పీ బుచ్చయ్య, డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్ కుమార్, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, సబ్ ఇన్స్పెక్టర్ సీనయ్య, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ అరుణను అవమానించడం అమానుషం

● బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి



బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా.బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి

**మిడ్జిల్, ఏప్రిల్ 11 (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో ):**
ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రోటోకాల్ పాటించకుండా ఒక మహిళా ఎంపీ డికే. అరుణను అవమానించడం అమానుషం అని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా.బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమరిచింతలో అమృత్ పథకం నిధులతో జరిగే అభివృద్ధి కార్యక్రమా నికి రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి వాకిటి శ్రీహరి ప్రోటోకాల్ పాటించక పోవడాన్ని తీవ్రంగాఖండిస్తున్నమన్నారు. ఈ ప్రాంత పార్లమెంట్ సభ్యురాలు గా నారాయణ పేట, ఆత్మకూరు, అమరచింత, మక్తల్ మున్సిపాలిటీలకు ఎంపీ అమృత్ పథకం కింద నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. ప్రోటోకాల్ కి విరుద్ధంగా మహిళా పార్లమెంట్ సభ్యురాలు డికే అరుణ కు సమాచారం ఇవ్వకుండా స్థానిక మంత్రి వాకిటి శ్రీహరి శంకుస్థాపనలు చెయ్యడం సిగ్గు చేటు అని అన్నారు. ప్రతి అధికారిక కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులుగా మా ఎంపి అరుణను, బీజేపీ ప్రజాప్రతినిధులకు తప్పక ఆహ్వానం అందించాలనీ డిమాండ్ చేశారు. అలా కాకుండా ఎంపీ అరుణను అడ్డుకుంటామని ఎవరిని బెదిరిస్తున్నారనీ ప్రశ్నించారు. ఎంపీ అనుక్షణం ఈప్రాంత అభివృద్ధి కోసం తపించే నాయకురాలనీ అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకం ప్రజలకు చేరవే యడం మా బాధ్యత దీనికి తగ్గట్టుగా ఈ ప్రాంతాలోని అన్ని గ్రామాలకు అరుణ వెళ్లడం జరుగుతుందన్నారు. ఇలాంటి మహిళా ఎంపీ అరుణను మీరు ప్రోటోకాల్ పాటించకుండా అవమాని స్తున్నారనీ అన్నారు. అభివృద్దే లక్ష్యంగా పని చేసే వ్యక్తి అరుణను అవమానిస్తూ ఇచ్చిన హామీలు అమలును చేయలేక రాష్ట్రం ప్రభుత్వం గారడీలు చేస్తుందనీ విమర్శించారు. మరోసారి ఇలాంటి పరిస్థితి వస్తె ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు.

## నర్వ మండలంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభం









● పాల్గొన్న ఎంపీ డీకే అరుణ

**మిడ్జిల్, ఏప్రిల్ 11 (నేటి దర్శిని):**
మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ నర్వ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు డాక్టర్ బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో భాగంగా నాగిరెడ్డిపల్లి గ్రామంలో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలో ఎంపీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు.
ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి క్రీడాకారులకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, కోకో క్రీడల కోసం సామాగ్రిని అందించి పోటీలను ప్రారంభించారు. అనంతరం లంకల గ్రామంలో సీసీ రోడ్డు మరియు ఐమాక్స్ లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికల్లో తనకు మద్దతు ఇచ్చిన నర్వ మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు సమకూరుస్తానని పేర్కొన్నారు. మండల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తూ, పరిష్కారానికి కృషి చేయాలని డాక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి తరచూ సూచిస్తున్నారని తెలిపారు. నాగిరెడ్డిపల్లి--ఉంద్యాల లింక్ రోడ్డు, లకర్ దొడ్డి, కొత్తపల్లి--నర్వ బీటీ రోడ్డు వంటి పనులను కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నిధులు అందిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తగిన విధంగా నిధులు ఇవ్వడంలో విఫలమైందని విమర్శించారు. మండల అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా అందరూ సహకరించాలని పిలుపునిచ్చిన ఆమె, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటానని స్పష్టం చేశారు. అధికారులకు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, క్రీడాకారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూలే జయంతి వేడుకలు

● మహనీయుడికి నివాళులర్పించిన డా. ఆలేటి శ్రీనివాస్ గౌడ్





**ఎల్బీనగర్, ఏప్రిల్ 11 (నేటి దర్శిని):**
సామాజిక సంస్కర్త, సమసమాజ స్థాపనకు కృషి చేసిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా ఎల్బీనగర్‌లో ఘనంగా నివాళుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి గౌరవ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు, పవన్ సాయి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ ఆలేటి శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని పూలే సేవలను స్మరించారు. కుల వివక్ష నిర్మూలన కోసం, మహిళా విద్యాభివృద్ధి కోసం మహాత్మ పూలే చేసిన కృషి అపారమని ఆయన పేర్కొన్నారు.అలాగే టీవీ ఎన్ఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్ మహారాజ్, దళిత బహుజన నాయకులు, విద్యార్థి సంఘ ప్రతినిధులు, బీసీ ఉద్యమ నాయకులు తదితరులు పాల్గొని మహాత్మ పూలేకు ఘన నివాళులు అర్పించారు.

## ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి





● మహిళా విద్యకు పునాది వేసిన మహనీయుడికి ఎస్పీ జానకి ఘన నివాళి
● పూలే ఆశయాల సాధనలో పోలీసులు కట్టుబడి పనిచేయాలి: ఎస్పీ డి. జానకి
● సమానత్వం కోసం పోరాడిన పూలేకు ఘన నివాళులు అర్పించిన జిల్లా పోలీసులు

**మిడ్జిల్, ఏప్రిల్ 11 (నేటి దర్శిని మహబూబ్‌నగర్ జిల్లా బ్యూరో):**
సమాజ సంస్కరణలకు మార్గదర్శకుడిగా, మహిళా విద్యకు పునాది వేసిన మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపిఎస్ పూలమాల వేసి మహాత్మ పూలే చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని పూలే సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ డి. జానకి మాట్లాడుతూ, మహాత్మ జ్యోతిరావు పూలే భారతదేశంలో సామాజిక సంస్కరణలకు పునాది వేసిన మహనీయుడని పేర్కొన్నారు. కుల వివక్ష, అసమానతలకు వ్యతిరేకంగా ఆయన నిరంతరం పోరాడారని, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు.ముఖ్యంగా మహిళా సాధికారత కోసం పూలే గారి కృషి అపారమని, ఆ కాలంలో మహిళలకు విద్య అందుబాటులో లేకపోయినా, మహిళలు చదువుకుంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆయన విశ్వసించారని తెలిపారు. తన సతీమణి సావిత్రిబాయి పూలేతో కలిసి బాలికల కోసం తొలి పాఠశాల స్థాపించి చరిత్ర సృష్టించారని గుర్తుచేశారు. అలాగే బాల్యవివాహాలు, స్త్రీలపై అన్యాయం, అణచివేతలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ మహిళలకు సమాన హక్కులు కల్పించేందుకు ఆయన చేసిన పోరాటం నేటికీ ఆదర్శంగా నిలుస్తోందని ఎస్పీ తెలిపారు. మహిళా విద్య, స్వాభిమానం, సమానత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు సేవ చేయడం పోలీసు శాఖ ప్రధాన కర్తవ్యమని, మహాత్మ పూలే ఆశయాలకు అనుగుణంగా సమానత్వం, న్యాయం పరిరక్షణలో కట్టుబడి పనిచేయాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్‌బి రత్నం, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణా రెడ్డి, ఆర్ఐ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## నల్లగొండలో టీపీసీసీ సాంస్కృతిక సేన నూతన కమిటీ సమావేశం



**నల్లగొండ, ఏప్రిల్ 11 (నేటి దర్శిని):**
మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా టీపీసీసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గౌరవ చక్రాల రఘు ఆదేశాల మేరకు నల్లగొండ జిల్లా సాంస్కృతిక సేన నూతన కమిటీ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశం సాంస్కృతిక సేన నల్లగొండ జిల్లా అధ్యక్షులు కోడి భీమ్ ప్రసాద్ ఆధ్వర్యంలో నల్లగొండలో జరిగింది..ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీ సభ్యులను ప్రకటించారు. జిల్లా మహిళా అధ్యక్షురాలిగా తోటకూరి ఉమా రాణి, మహిళా ఉపాధ్యక్షురాలిగా గాదరి అనూష, జిల్లా ఉపాధ్యక్షుడిగా ప్రజా గొంతుక సతీష్, ప్రధాన కార్యదర్శిగా నల్ల మను, కార్యదర్శులుగా కాశీపాక వెంకన్న, రేపాక కృష్ణన్న, కాశీపాక లింగాస్వామి నియమితులయ్యారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా టీపీసీసీ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు ఎర్ర అనుదీప్ కుమార్, సూర్యాపేట జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎర్ర రాధిక హాజరై నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.సమావేశంలో పూలే ఆశయాలను కొనసాగిస్తూ సామాజిక న్యాయం, సమానత్వం కోసం కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. అలాగే పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

తెలుగు దిన పత్రిక RNI NO: TGTEL/25/A0471
www.epaper.netidarshini.com
ఆదివారం 12-4-2026

## సామాజిక సమానత్వానికి మార్గదర్శకుడైన పూలేకు ఎల్బీనగర్‌లో నివాళులు

- పూలే ఆశయాలు స్ఫూర్తిగా ముందుకు సాగుదాం: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**ఎల్బీనగర్, ఏప్రిల్11 (నేటి దర్శిని):**
సామాజిక సమానత్వం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానేత, ప్రముఖ సామాజిక సంస్కర్త మహాత్మా జ్యోతిరావ్ పూలే గారి జయంతి సందర్భంగా ఎల్బీనగర్‌లో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డితో కలిసి స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని విశ్వసించిన మహాత్మా పూలే మహిళా విద్య, దళితుల హక్కులు, సామాజిక న్యాయం కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన చూపిన మార్గం నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తోందని పేర్కొన్నారు. పూలే ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారా సమానత్వ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ ఆయన సిద్ధాంతాలను అనుసరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు పోచబోయిన జగదీష్ యాదవ్, పూలే యువజన సంఘం సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే మనిషి మహోన్నతుడవుతాడు

- ఉప్పల శ్రీనివాస్ గుప్త





**ఎల్బీనగర్, ఏప్రిల్ 11 (నేటి దర్శిని):**
మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దేది విద్య ఒక్కటేనని టిపిసిసి ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఎల్బీనగర్‌లో పూలే యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పూలే విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, వారి విద్యాభివృద్ధి కోసం జీవితాంతం కృషి చేసిన మహానుభావుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని కొనియాడారు. చదువు లేనిదే జ్ఞానం లేదు, జ్ఞానం లేనిదే పురోగతి లేదు అనే భావనను ప్రజల్లో నాటిన మహోన్నత నాయకుడని పేర్కొన్నారు. 19వ శతాబ్దంలోనే నిమ్న జాతుల కోసం, మహిళల కోసం దేశంలో తొలి పాఠశాలలను స్థాపించి విద్యావ్యాప్తికి బాటలు వేసిన దూరదృష్టి గల సంస్కర్త పూలే అని అన్నారు. కుల వివక్షత, సాంఘిక దురాచారాలు, మూఢనమ్మకాలను నిర్మూలించడంలో ఆయన చేసిన సేవలు అపూర్వమని తెలిపారు. అణచివేతలకు గురైన బడుగు, బలహీన వర్గాలకు ఆత్మవిశ్వాసం కల్పించి, వారి హక్కుల సాధన కోసం పోరాడిన గొప్ప మానవతావాది పూలే అని ఉప్పల శ్రీనివాస్ గుప్త కొనియాడారు. ఈ కార్యక్రమంలో జోగు రాములు, శ్రీనివాస్, పూలే యువజన సంఘం నాయకులు స్వామి, శ్రీధర్, గణేష్ చారి తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా నిరుపేద విద్యార్థులకు అల్పాహార పంపిణీ





**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 11 (నేటి దర్శిని):**
మహాత్మా జ్యోతిరావు పూలే జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక పాఠశాలలో నిరుపేద విద్యార్థులకు అల్పాహార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం సమాజ సేవా దృక్పథాన్ని ప్రతిబింబిస్తూ విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంపొందించేందుకు నిర్వహించబడింది. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ, మహాత్మా పూలే చూపించిన మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. విద్యార్థులు మంచి విలువలను అలవరచుకొని, తమ తల్లిదండ్రుల పేరును నిలబెట్టేలా అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సమితి కోశాధికారి కుష్ అగర్వాల్, సభ్యులు సిద్ధార్థ్ పాల్చం, పాకా సతీష్ యాదవ్, డోమల్లపల్లి సునీల్ మరియు సునీల్ దరాడే పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేసి, పూలే ఆశయాలను వివరించారు.

## మిడ్జిల్‌లో రేషన్ బియ్యం అక్రమ రవాణా



- సివిల్ సప్లై అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం
- గ్రామాల నుంచి బియ్యం సేకరించి రహస్యంగా తరలింపు
- టూ వీలర్లతో అధికారులను మభ్యపెడుతున్న దళారులు
- కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

**మిడ్జిల్, ఏప్రిల్ 11 (నేటి దర్శిని ప్రతినిధి):**
మిడ్జిల్ మండలంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా విస్తృతంగా జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా మల్లాపురం, గుడియాన్‌పల్లి, మాదారం గ్రామాలకు చెందిన కొందరు దళారులు రేషన్ బియ్యాన్ని తక్కువ ధరలకు కొనుగోలు చేసి, అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ దళారులు తమ కార్యకలాపాలను అత్యంత గోప్యంగా నిర్వహిస్తూ, పెద్ద వాహనాల బదులుగా టూ వీలర్లను వినియోగించడం ద్వారా అధికారులను మభ్యపెడుతున్నారని సమాచారం. పగటి పూటనే చిన్న పరిమాణాల్లో బియ్యం తరలిస్తూ అనుమానం రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అయితే, ఈ అక్రమ రవాణాపై సివిల్ సప్లై మరియు రెవెన్యూ అధికారులు సముచిత చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు కేవలం కార్యాలయాలకు మాత్రమే పరిమితమై, ఫీల్డ్ స్థాయిలో పర్యవేక్షణ లేకపోవడం వల్ల దళారులు రెచ్చిపోతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారించి, అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అరికట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అదేవిధంగా, గ్రామ స్థాయిలో తనిఖీలు పెంచి, పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్‌ను పారదర్శకంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయము: ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు

- పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా ముఖ్యమంత్రి సహాయనిధి నిధులు అందిస్తామన్న ఎమ్మెల్యే
- పేదింటి ఆడపడుచులకు అండగా కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 11 (నేటి దర్శిని బ్యూరో):**
పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోందని, రాష్ట్రంలో రేషన్ కార్డు దారులకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ అన్నారు.వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణ కేంద్రం లోని ఎం ఎం ఆర్ గార్డెన్స్ నందు వర్ధన్నపేట పట్టణ, వర్ధన్నపేట మండలానికి కి సంబంధించిన 38 మంది లబ్ధిదారులకు 38 లక్షల 4 వేల 408 రూపాయలు విలువ గల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 58 మందికి రూ.14 లక్షల 11 వేల రూపాయలు విలువైన చెక్కులను వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుపంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూతెలంగాణ రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అనారోగ్యానికి గురై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న నిరుపేదలకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం ఆపన్న హస్తం అందిస్తోందని చెప్పారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సహాయం అందిస్తూ వారి కుటుంబాలకు భరోసా కల్పిస్తోందన్నారు. మహిళ ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటూ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పలు కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రతి డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి కాలనీల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు.వర్ధన్నపేట నియోజకవర్గంలో విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలు డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను తెలియజేయాలని సూచించారు. అర్హులైన పేద ప్రజలందరికీ సీఎం రిలీఫ్ ఫండ్ అందేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రభుత్వ పథకాలను పూర్తిగా పారదర్శకంగా అందజేస్తామని ఎమ్మెల్యే నాగరాజు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## జడ్చర్లలో ఘనంగా వాలీబాల్, కబడ్డీ టోర్నమెంట్ ఫైనల్స్






**మిడ్జిల్, ఏప్రిల్ 11 (నేటి దర్శిని -- మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని డాక్టర్ బి.ఆర్. గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన వాలీబాల్ మరియు కబడ్డీ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లు ఆదివారం ఘనంగా ముగిశాయి. క్రీడాకారుల ఉత్సాహం, ప్రేక్షకుల చప్పట్ల మధ్య పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి..ఈ కార్యక్రమానికి పార్లమెంట్ సంసద్ క్రీడా మహోత్సవ జిల్లా కన్వీనర్ ముచ్చర్లపల్లి జనార్దన్ రెడ్డి, జడ్చర్ల టౌన్ అధ్యక్షులు అమర్నాథ్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత యువత ప్రతిరోజూ కనీసం ఒక గంట సమయం క్రీడలకు కేటాయించాలని సూచించారు. క్రీడలు ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా క్రమశిక్షణ, జట్టు భావనను పెంపొందిస్తాయని తెలిపారు. ఆరోగ్యవంతమైన భారతదేశ నిర్మాణం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశయమని పేర్కొన్నారు. పోటీ ఫలితాలు: వాలీబాల్: విజేత -- డాక్టర్ బి.ఆర్. గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ జట్టు ద్వితీయ స్థానం -- కావేరమ్మపేట జట్టు, కబడ్డీ: విజేత -- గౌరీ శంకర్ కాలనీ జట్టు, ద్వితీయ స్థానం -- కావేరమ్మపేట జట్టు, ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బాలకృష్ణ, సాహితి, కృష్ణయ్య, నవీన్, నరేష్, వెంకటేష్, చెన్నకేశవులు, వ్యాయామ ఉపాధ్యాయులు విజయ్ ప్రసాద్, సందీప్, బాల్రాజ్ తదితరులు పాల్గొన్నారు. సుమారు 500 మంది ప్రేక్షకులు ఫైనల్ మ్యాచ్‌లను ఆసక్తిగా వీక్షించి క్రీడాకారులను ప్రోత్సహించారు.

## ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు





**కొండ మల్లేపల్లి, ఏప్రిల్ 11 ( నేటి దర్శిని):**
నల్గొండ జిల్లా కొండ మల్లేపల్లి మండల పరిధిలోని చింతకుంట్ల గ్రామ పంచాయతీ డి.యం. కుంట గ్రామంలో మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పూలే విగ్రహానికి గ్రామస్థులు, యువకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ నల్గొండ జిల్లా అధ్యక్షులు మద్దిమడుగు భిక్షపతి , ఉపాధ్యక్షుడు యేకుల సురేష్ మాట్లాడుతూ, సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి, ముఖ్యంగా మహిళా విద్య కోసం జ్యోతిరావు పూలే చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారికి గురువుగా భావించబడే పూలే ఆశయాలను ప్రతి ఒక్కరూ పుణికిపుచ్చుకోవాలని, సామాజిక సమానత్వం కోసం ఆయన చూపిన బాటలో నడవడమే మనం ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో మాజీ సర్పంచ్ గండిమల్ల కాంతయ్య పాల్గొని పూలే జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. యూత్ కాంగ్రెస్ దేవరకొండ నియోజకవర్గ సెక్రటరీ యేకుల అంబేద్కర్ మాట్లాడుతూ, మహనీయుల ఆశయ సాధన కోసం యువత నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ పి. ఎ పల్లి మండల అధ్యక్షులు చేపూరి లక్ష్మయ్య మరియు యేకుల యాకోబు, సంపతయ్య, చేపూరి బుచ్చమ్మ, యేకుల అంజూర , కోరే సునీత , యేకుల వెంకటేశ్వర్లు, రాజు, చేపూరి ప్రశాంత్ గౌతం, యేకుల వెంకటయ్య, రమేష్, వెంకటమ్మ మరియు గ్రామ యువత, ప్రజలు పాల్గొని పూలే మరియు అంబేద్కర్ విగ్రహాలకు నివాళులర్పించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్యారడైజ్ నుంచి కాయడు లోహర్ లుక్ విడుదల

నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' నుంచి ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న కాయడు లోహర్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఈ పోస్టర్‌లో కాయడు రెట్రో లుక్‌లో అలరిస్తుంది. ఇక 'దసరా' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత నాని శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా.. ÷ూఒ÷ఎ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. సికింద్రాబాద్ స్లమ్ ఏరియా నేపథ్యంలో పీరియడ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇందులో నాని 'జడల్' అనే ఊర మాస్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాలో మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'రా స్టేట్‌మెంట్' గ్లింప్స్ సినిమాపై భారీ అంచనాలను పెంచింది.






## మతిపోగొడుతున్న మీనాక్షి కిలాడి బ్యూటీ కిర్రాక్ అందం


# అనుపమ ఫాలో అవుతున్న ఫార్ములా ఏంటి ??

అనుపమ పరమేశ్వరన్ లాస్ట్ ఇయర్ ఎన్ని సినిమాలు చేశారో తెలుసా? ఆ నెంబర్ ని ఈ ఇయర్ రిపీట్ చేస్తారా? అసలు సినిమాల సెలక్షన్ విషయంలో ఆమె ఫాలో అవుతున్న విధానం ఏంటి? డైరక్షన్ కలలను సైడ్ చేసేశారా? ఇలాంటి చాలా విషయాలు డిస్కస్ చేసుకుందాం వచ్చేయండి. సినిమాల ఎంపికలో అనుపమ పరమేశ్వరన్ తన ప్రాధాన్యతలను మార్చుకున్నట్టు స్పష్టంగా కనిపిస్తోంది. అనుపమ సైన్ చేశారంటే సినిమాలో ఏదో స్పెషాలిటీ ఉండి తీరుతుందని ఇప్పటికే చాలా మంది ఫిక్సయ్యారు. అయితే నేపథ్యం, లేకుంటే కథ, కథనం.. ఎక్కడో ఏదో కొత్తగా ఉంటేనే సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు ఈ బ్యూటీ. లాస్ట్ ఇయర్ ఏకంగా అరడజను సినిమాలతో మెప్పించారు అనుపమ. వాటిలో కొన్ని పెద్దగా ఆడకపోయినా, మరికొన్ని మాత్రం ఆమెకు చాలా సినిమాలను తెచ్చిపెట్టాయి. ఈ ఏడాది కూడా లాక్ డౌన్ మూవీ ఉంది ఆమె ఖాతాలో. మరోవైపు తెలుగులో క్రేజీ కల్యాణం అనే సినిమాలో నటిస్తున్నారు. మరోవైపు షాన్ తో అనుపమ మూవీ కూడా ప్రేక్షకుల్లో ఇంట్రస్ట్ క్రియేట్ చేస్తోంది. గతంలో వీరిద్దరూ కలిసి చేసిన ఓ షార్ట్ పిల్మ్ జనాల్లో సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఇప్పుడు అదే జోడీ తెరమీదకు రానుండటంతో క్రేజీ బజ్ స్టార్ట్ అయింది. నటిగా ఎంత ఎదిగినా, డైరక్టర్‌గానూ ప్రూవ్ చేసుకోవాలన్నది ఈ బ్యూటీ డ్రీమ్. అందుకే ఏ సెట్లో ఉన్నా, డైరక్షన్ డిపార్ట్ మెంట్ లో పనిచేస్తున్నట్టుగానే ఫీలవుతున్నానంటారు ఈ లేడీ



## నెట్‌ఫ్లిక్స్‌లోకి

# ఉస్తాద్ భగత్ సింగ్




పవన్ కల్యాణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. హరీశ్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీని ఫిక్స్ చేసుకుంది. ఏప్రిల్ 16 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. గతంలో దీనికి సంబంధించి ఎన్నో వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వాటికి చెక్ పెడుతూ తాజాగా నెట్‌ఫ్లిక్స్ దీనిపై అధికారిక ప్రకటన విడుదల చేసింది. దేవిశ్రీ ప్రసాద్, తమన్ సంగీతం అందించిన ఈ సినిమాలో పవన్‌కు జోడీగా రాశీఖన్నా, శ్రీలీల నటించారు. నల్లమలకు సమీపంలో ఓ గూడెం అది. అక్కడికి పాఠాలు బోధించేందుకు చంద్రశేఖర్ రావు (కె.ఎస్.రవికుమార్) అనే మాస్టారు వస్తారు. అక్కడి జనం కోసం తన జీతాన్ని, జీవితాన్ని అంకితం చేస్తాడు. కూలి పనులకు వెళ్లే పిల్లలు మళ్లీ చదువుల కోసం బడి బాట పట్టేలా చేస్తారు. ఆ ఊళ్లోనే పుట్టి పెరిగి అనాథగా ఉన్న చిన్నయ్యని చేరదీసి అతనికి సంరక్షకుడిగా మారి చదువు చెప్పిస్తాడు. ఆ కుర్రాడి భావాలు, అతనిలోని ఆవేశం గ్రహించి భగత్‌సింగ్ అని పేరు పెడతాడు. తన తండ్రిని ఉస్తాద్ అని పిలిచేవారని తన పూర్తి పేరును ఉస్తాద్ భగత్‌సింగ్ అని చెప్పుకొంటాడు ఆ కుర్రాడు. ఆ తర్వాత సేవాగుణం ఉన్న మాస్టారు రాజకీయాల్లోకి అడుగుపెట్టి ముఖ్యమంత్రి అవుతారు. చిన్నప్పటి ఉస్తాద్ భగత్‌సింగ్ పెద్దయ్యాక ఏసీపీ (పవన్‌కల్యాణ్) అవుతాడు. ముఖ్యమంత్రి అయిన తన గురువుకు ఎప్పుడూ రక్షణగా ఉంటుంటాడు. అయితే అసాంఘిక శక్తులతో సంబంధాలున్న చెదలమర్రి నల్లనాగప్ప (పార్తిబన్) ముఖ్యమంత్రి పీఠంపై కన్నేస్తాడు. చంద్రశేఖర్‌రావుని అంతం చేయాలని పథకం రచిస్తాడు. మరి నల్లనాగప్పని ఏసీపీ ఉస్తాద్ భగత్‌సింగ్ ఎలా ఎదుర్కొన్నాడు? ఉస్తాద్ జీవితంలోకి వచ్చిన లీల (శ్రీలీల), శ్లోక (రాశీఖన్నా) ఎవరు అన్నది చిత్ర కథ.

# ఓటిటిలోకి యూత్ మూవీ

తమిళంలో ఘనవిజయం సాధించి, తెలుగులోనూ మంచి ఆదరణ పొందిన లేటెస్ట్ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'యూత్' ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ప్లిక్స్ ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకోగా ఈ చిత్రం ఏప్రిల్ 16, 2026 నుంచి స్ట్రీమింగ్ కానుంది. కెన్ కరుణాస్ ఈ చిత్రంలో కథనాయకుడిగా నటించడంతో పాటు దర్శకత్వం వహించగా.. అనీషా అనిల్ కుమార్, మీనాక్షి దినేష్, ప్రియాన్షీ యాదవ్, సూరజ్ వెంజరమూడు, దేవదర్శిని తదితరులు కీలక పాత్రల్లో నటించారు. మార్చి 19న తమిళంలో, మార్చి 27న తెలుగులో థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను సాధించింది ఈ చిత్రం. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఒక మధ్యతరగతి టీనేజర్ తన స్కూల్, కాలేజ్ రోజుల్లో ప్రేమ కోసం చేసే ప్రయత్నాలు, ఎదుర్కొన్న అవమానాలు మరియు బ్రేకప్స్ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఒక యువకుడు తన జీవిత ప్రయాణంలో ఎదురైన అనుభవాల నుండి ఎలా పరిణతి చెందాడు అనే అంశాన్ని దర్శకుడు వినోదాత్మకంగా, భావోద్వేగపూరితంగా తెరకెక్కించారు.





Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365